నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, మంగళవారం 6 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI

ఎంజీయూ పరీక్షల షెడ్యూల్ విడుదల

రామగిరి, ఫిబ్రవరి 5 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ 3వ సెమిస్టర్, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ సెమిస్టర్ 1, 2 పరీక్షల నిర్వహణ షెడ్యూల్ విడుదల చేసినట్లు వర్సిటీ సీఓఈ జి.ఉపేందర్ రెడ్డి తెలిపారు. పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విద్యార్థుల కు సమాచారం తెలియజేయాలని కోరారు.

గుత్తా ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై ఉచిత పరీక్షలు

నల్లగొండ, ఫిబ్రవరి 5 : గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6, 7 తేదీల్లో సియాన్ క్యాన్సర్ క్లినిక్స్ సౌజన్యంతో క్యాన్సర్‌పై ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రేడియేషన్ రహితంగా, అత్యంత గోప్యంగా మానవ స్పర్శ లేకుండా ఓరల్ క్యాన్సర్‌తోపాటు మహిళలకు బ్రెస్ట్ స్క్రీనింగ్ టెస్టులు చేస్తారని తెలిపారు. అలాగే క్లోవ్ డెంటల్ సౌజన్యంతో ఉచిత దంత పరీక్షలు కూడా నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ఉచిత క్యాంపు నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కాలనీలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నివాసంలో ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనపు వివరాలు కోసం 9542308396 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాతీర్పు బీఆర్ఎస్‌కే..

బీఆర్ఎస్‌ను బొందపెట్టే వాడు పుట్టలేదు

- కోమటిరెడ్డీ.. రైతులను చెప్పుతో కొడతావా?
- మాటతీరు మార్చుకోకపోతే ప్రజలు గోరి కట్టడం ఖాయం
- బీఆర్ఎస్ ఆలేరు నియోజకవర్గ సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- అధికార పార్టీకి అహంకారం పెరిగింది : మాజీ ఎమ్మెల్యే సునీత

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 5 : 'ఆరు గ్యారెంటీలు కాదు.. 420 హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా కనీసం ఒక్కటి కూడా అమలు చేయలేదు. డిక్లరేషన్, అభయహస్తం పేరిట మ్యానిఫెస్టోతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంటు ఎన్నికల్లో బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అని మాజీ మంత్రి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మరో 50 రోజుల్లో కాంగ్రెస్ పార్టీపై ఉన్న భ్రమలు తొలగిపోతాయని పేర్కొన్నారు. యాదగిరిగుట్టలో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆలేరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామన్నారు. పాలన నచ్చకపోతే ప్రజలు తమ ప్రతాపాన్ని చూపిస్తారని తెలిపారు. పార్టీ క్యాడర్‌కు ప్రియారిటీ ఇవ్వకపోవడం.. పార్టీకి, ప్రభుత్వానికి సమన్వయం లోపించిన మాట వాస్తవమేనని అన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ వరుసగా మూడు సార్లు అధికారంలోకి రాలేదని తెలిపారు. తెలంగాణకు కేసీఆర్ మాత్రమే శ్రీరామరక్ష అని, రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని అన్నారు. పక్క రాష్ట్రాల కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కాపాడుకోవడం కోసం తెలంగాణను అడ్డాగా మార్చారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పథకాలు ప్రజల్లో మెదులుతున్నాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలకు ఆశపడి ప్రజలు ఓటేశారని, ప్రజల్లో ఉన్న భ్రమలు తొలగిపోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ నాయకులు వారికి తెలియకుండానే 420 హామీలిచ్చి వారి నిజమైన వైఖరిని బయట పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 9న ఇందిరమ్మ రాజ్యం వస్తుంది.. తొలి సంతకం రుణమాఫీపై ఉంటుందని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఏమైందని ప్రశ్నించారు.

యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

రైతులను చెప్పుతో కొడతావా కోమటిరెడ్డి..

రైతుబంధు రాలేదని అడిగితే రైతులను చెప్పుతో కొట్టాలంటావా? అని మంత్రి కోమటిరెడ్డిని ప్రశ్నించారు. ఒకవేళ రైతుబంధు రాకుంటే ఆ రైతులే నిన్ను చెప్పుతో కొట్టాల్నా? అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన రుణమాఫీ హామీపై స్పష్టత లేదని, మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతు భరోసా దేవుడెరుగు రైతు బంధు ఎప్పుడిస్తారని, ఇచ్చిన హామీలు ఏమయ్యాయని అడగడం తప్పా? అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. ప్రజల పార్టీ అయిన బీఆర్ఎస్‌ను బొంద పెట్టే నాయకుడు ఇంకా పుట్టలేదన్నారు. అసమర్థతను, చేతగానితనాన్ని ప్రశ్నిస్తే వంద గజాల లోతున బొంద పెడతారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు చేయకపోతే ఆ పార్టీని ప్రజలే బొంద పెడతారని హెచ్చరించారు.

పార్టీని మరింత పటిష్ట పరుస్తాం

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యామని కుంగిపోనవసరంలేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల సమయానికి కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయి, బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన వారికి మరోసారి బీఆర్ఎస్‌లో చోటు ఉండదని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారం, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎక్కువ రోజులు అధికారంలో ఉండబోదన్నారు. రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని పటిష్ట పరుస్తామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పార్లమెంట్‌లో మాట్లాడలేరని, బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రజా గొంతుకగా ఉంటారని అన్నారు. అనంతరం నియోజకవర్గంలో వివిధ కారణాలతో మృతిచెందిన పార్టీ కార్యకర్తల కు టుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల బీమా చెక్కులు అందజేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్ మాట్లాడుతూ లక్కీ లాటరీగా రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని, పథకాలు అమలు చేయలేకనే కాంగ్రెస్ పార్టీ నాయకులు నోరెత్తుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం పోయిందని, కేసీఆర్‌ను వదులుకుని తప్పు చేశామని భావిస్తున్నారని తెలిపారు.

కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పల్లెపాటి సత్యనారాయణ, ఎంపీపీలు గోపగాని బాలమణి, పైళ్ల ఇందిర, జడ్పీటీసీలు పల్లా వెంకట్‌రెడ్డి, చామకూర గోపాల్‌గౌడ్, తోటకూరి అనూరాధ, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, మార్కెట్ కమిటీ చైర్మన్ వస్పరి శంకరయ్య, నాయకులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

అహంకారం ప్రదర్శిస్తున్న అధికార పార్టీ

అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీకి అహంకారం పెరిగింది. ప్రజలకు దూరంగా ప్రభుత్వం ఉంటుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయంలో దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులుగా ఉంటూ నన్ను క్షమించి నా వెంట నడిచారు. యాదగిరిగుట్టలో 100 పడకల ఆసుపత్రిని అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దాని ఊసేత్తడం లేదు. ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరైతే ఇప్పటి వరకు దానిపై స్పష్టత లేదు. గుట్టలో వంద పడకల ఆసుపత్రి, మెడికల్ కళాశాల నిర్మించకుంటే త్వరలో ఉద్యమం చేపడుతాం. అప్పులు చేశారని కేసీఆర్‌ను విమర్శిస్తున్న రేవంత్‌రెడ్డి అజ్ఞాని. ఆయన నోరు తెరిస్తే అబద్ధాలే. ప్రతి వార్షిక బడ్జెట్‌లో అప్పులు, మిగులు ఎంతో వివరంగా నివేదిక ఇస్తారు. అది చూడకుండా అప్పుల పాలైందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటు. కృష్ణా జలాల వాటాపై పోరాటానికి సిద్ధంగా ఉన్నాం.

– మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆందోళన వద్దు.. పార్టీ అండగా ఉంటుంది

పార్టీ అధికారం కోల్పోయిందని కార్యకర్తలు ఆందోళన చెందవద్దు. నాపై జరిగిన దాడికి పార్టీ అధిష్టానం నుంచి గ్రామస్థాయి నాయకుల వరకు స్పందించారు. మంత్రి కోమటిరెడ్డి మతిభ్రమించి ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

రేవంత్‌రెడ్డి మాటలు సిగ్గుచేటు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్రామాల్లో నీళ్లు రావడం లేదు. కరెంటు కష్టాలు మొదలయ్యాయి. రెండు నెలలు కూడా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం 5 ఏండ్లు ఎలా ఇస్తారో ప్రజలు పునరాలోచనలో పడ్డారు. ఉద్యమ నాయకుడు, పదేండ్లు సీఎంగా ఉండి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిన కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టి ఎంపీ, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల్లో గెలులే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలి.

– బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

పార్లమెంట్ సీటును బలహీన వర్గాలకు ఇవ్వాలి

కాంగ్రెస్ పార్టీతో బలహీన వర్గాలకు న్యాయం జరిగే పరిస్థితి లేదు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి మాజీ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధికంగా ఉన్న భువనగిరి పార్లమెంట్ సీటును బలహీన వర్గాలకు కేటాయించాలి. పార్టీని నమ్ముకొని వచ్చిన నాయకులకు గౌరవ మర్యాదలకు లోటురాకుండా చూడాలి.

– మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

గుట్టలో వైభవంగా నిత్యోత్సవాలు

స్పటిక లింగేశ్వరస్వామికి హారతి ఇస్తున్న పురోహితుడు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి5 : యాదగిరి గుట్టలో లక్ష్మీనృసింహుడికి నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సోమవారం సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతును చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నర కుపైగా కల్యాణ తంతును జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం నిర్వహించారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. ప్రధానాలయ ముఖమండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులకు సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం తిరువీధిసేవ, దర్బార్ సేవను వైభవంగా జరిపారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు ఘనంగా అత్యంత వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటికలింగేశ్వరుడికి రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 34,02,176 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

రేవంత్.. భాష మార్చుకో..

- మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికావు
- యాదాద్రి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి
- భువనగిరిలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 5 : తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అసభ్య పదజాలంతో దూషించడం సరికాదని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి అసభ్యకర పదాలను వాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి తీరును మార్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను దూషించడం సరికాదని, ఇందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమాన్ని చూడడంపోయి పంతాలు, పట్టింపులు చేయడం సరికాదన్నారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌కు క్షమాపణ చెప్పకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బీరు మల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, ప్రధాన కార్యదర్శులు రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓంప్రకాశ్, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సూర్యాపేట లోనూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేసీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, నాయకులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

భువనగిరిలో వసతి గృహం వార్డెన్‌తో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

విద్యార్థినుల మృతిపై విచారణ వేగవంతం చేయాలి

- జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 5: ఎస్సీ హాస్టల్ విద్యార్థినుల ఆత్మహత్యపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేసి విచారణ వేగవంతంగా, నిష్పక్షపాతంగా చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఎస్సీ వసతి గృహాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మహత్య జరిగిన సంఘటన చాలా బాధాకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని వసతి గృహం వార్డెన్‌కు సూచించారు. ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం వెంటనే అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, పార్టీ పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓంప్రకాశ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

14నుంచి చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు

- 21వరకు కార్యక్రమం
- అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 5 : ఈ నెల 14 నుంచి 21వరకు జరిగే చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులకు సూచించారు. చెర్వుగట్టు గుట్టపై ఈఓ కార్యాలయం వద్ద జిల్లా అధికారులతో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో అతిపెద్ద శైవ క్షేత్రంగా పేరొందిన చెర్వుగట్టు రామలింగేశ్వర స్వామి కల్యాణానికి భక్తులు దూర ప్రాంతాల నుంచి వస్తున్నందున ఆ మేరకు వసతులు కల్పించాలన్నారు. గుట్ట కింద రోడ్డుకు ఇరువైపులా దూరంగా దుకాణ సముదాయాన్ని ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నందున సర్వీసులను అధిక సంఖ్యలో వేయాలని ఆర్టీసీ డిపో అధికారులకు సూచించారు. డ్రైనేజీ, మంచినీటి సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండాలని, అధికారులు దేవాలయ సిబ్బందికి సహకరించాలని అన్నారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించే భక్తులకు టికెట్లు విక్రయిస్తున్నందున తాను కూడా టికెట్ తీసుకొని కల్యాణంలో పాల్గొంటానని తెలిపారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవి శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఈఓ నవీన్, తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ యాదగిరి, సంబంధిత అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు జెండగే

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 : ఈ నెల 7 నుంచి 15 వరకు గ్రామాల్లో చేపట్టే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో (స్పెషల్ శానిటేషన్ డ్రైవ్) ప్రజల అవసరాలు, గామాభివృద్ధి పనులను గుర్తించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే ప్రత్యేక అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ ప్రత్యేక అధికారులు ఈ నెల 7 నుంచి 15 వరకు చేపట్టే స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నూతన పంచాయతీరాజ్ యాక్ట్ 2018 పై స్పష్టమైన అవగాహన పొందాలని సూచించారు. పారిశుధ్య పనులు, వీధి లైట్లు, వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్స్, తడి, పొడి చెత్త సేకరణ, నర్సరీలు, పల్లెప్రకృతి వనాల నిర్వహణ, ట్యాక్స్ కలెక్షన్స్ వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. వేసవి ప్రారంభమవుతున్నందున ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులపై తీర్మానాలు సకాలంలో చేసి సత్వర గ్రౌండింగ్ జరిగేలా చూడాలని చెప్పారు. రాబోయే జూన్, జూలైలో మొక్కలు నాటేందుకు కావాల్సిన మొక్కలను నర్సరీలలో సంరక్షించాలని తెలిపారు. ఉపాధి హామీలో గ్రామాల అవసరాలకు అనుగుణంగా ఎక్కువ పనులు చేపట్టేలా, ఎక్కువ మందికి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. గ్రామ సభల్లో తీర్మానాలు చేసిన అనంతరమే పనులు చేపట్టాలని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి పంచాయితీరాజ్ చట్టం 2018పై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డివిజనల్ పంచాయతీ, మండల అభివృద్ధి, మండల పంచాయతీ, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో పాల్గొన్న ప్రత్యేకాధికారులు

ఇష్టారాజ్యంగా స్ట్రాంగ్ రూమ్‌లోకి..

- ఐడీ కార్డులు లేకుండా, సెల్‌ఫోన్‌తో వెళ్లి ఈవీఎంల పరిశీలనకు

స్ట్రాంగ్ రూమ్‌లో ఐడీ కార్డు లేని ఓ పార్టీ నాయకుడు, జేబులో సెల్ ఫోన్‌తో మరో నాయకుడు

సూర్యాపేట, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రథమ స్థాయి పరిశీలన (ఎఫ్ఎల్‌సీ)లో నిర్లక్ష్యం కనిపించింది. నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూంలోకి వెళ్లాలంటే స్ట్రాంగ్ రూం వద్ద ప్రత్యేక రికార్డులో పేరు నమోదు చేయాల్సి ఉంటుంది. అధికారులు, సిబ్బందితోపాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులకు ప్రత్యేకంగా ముద్రించిన ఐడీ కార్డులు ఇస్తారు. వాటిని మెడలో వేసుకొని సెల్ ఫోన్లను బయటే ఉంచి లోపలికి వెళ్లాలి. కానీ.. సోమవారం సూర్యాపేటలో ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌లోకి జిల్లా కలెక్టర్, నాయకులు వెళ్లే సమయంలో అధికార యంత్రాంగం నిబంధనలను గాలికి వదిలేసింది. ఒకరు మెడలో ఐడీ కార్డు లేకుండా, మరకొరు జేబులో సెల్‌ఫోన్‌తో లోపలికి వెళ్లారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.